క్లుప్తంగా

మార్కండేయ స్వామికి విశేష పూజలు



శివ పార్వతులకు ఊంజల సేవా నిర్వహిస్తున్న పద్మశాలి కులబాంధవులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో పద్మశాలి కులబాంధవుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామికి విశేష పూజలు చేపట్టారు. ఆదివారం ఆలయంలో స్వామి వారికి శ్రావణ మాసం మూడో ఆదివారాన్ని పురస్కరించుకుని నంద్యాలకు చెందిన వేదపండితులు మల్లికార్జున స్వామి, ఆలయ అర్చకులు వీరేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, వెండి కవచ అలంకరణ, మహా మంగళ హారతులు గావించి, ఫలపుష్పాలు సమర్పించారు. అలాగే గణపతి, నవగ్రహ, ఆంజనేయ స్వాములకు హారతులు ఇచ్చి పూజలు చేశారు. భక్తాదులు శివ పార్వతి విగ్రహాలకు ఊంజల సేవా కార్యక్రమం నిర్వహించారు. శ్రావణ మాస మూడవ సోమవారం పురస్కరించుకుని సాయంకాలం శివపార్వతిల విగ్రహాలను ఎద్దుల బండి కొలువుంచి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు, కమిటీ పెద్దలు తెలిపారు. పద్మశాలి కుల బాంధవులు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న రైతు సంఘం నాయకులు

కోసిగి: కేరళలోని వయనాడ్‌లో వరదల కారణంగా సర్వం కోల్పోయిన బాధితుల సహాయార్థం ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఆదివారం కోసిగిలోని వ్యాపార సముదాయాల్లో తిరిగి రూ.3,361 నగదును సేకరించినట్లు ఆ సంఘం జిల్లా నాయకులు మల్లయ్య, కోసిగి మండల కార్యదర్శి వీరేష్, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, కేవీపీఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు తెలిపారు. సేకరించి నిధిని కేరళ ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో చిన్నారెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో విద్యను అందించాలి

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు శాస్త్రీయ, సాంకేతిక పద్ధతిలో విద్యను అందించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని బహుజన్ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ పి. రమేష్ తెలిపారు. బీడీఎస్ఎఫ్ 25వ అవిర్భావ దినోత్స వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. బీడీఎస్ఎఫ్ జెండాను అవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యావిధానం ద్వారా విద్య కషాయీకరణతో సాగే విధంగా చర్యలు చేపడుతోందన్నారు.ఇదే జరిగితే భవిష్యత్తులో పెను ప్రమాదానికి దారితీసే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్, యుగంధర్, సాయి, పవన్‌సూరి తదితరులు పాల్గొన్నారు.


శ్రీమఠంలో కర్ణాటక డీఐజీ



పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో డీఐజీ విజయలక్ష్మి కుటుంబ సభ్యులు

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక డీఐజీ విజయలక్ష్మి కుటుంబ సభ్యులతో ఆదివారం మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన చేశారు. రాఘవేంద్రుల మూలబృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులను కలుసుకున్నారు. ఆమెతో పాటు ఎస్ఐ గోపీనాథ్, ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సీఐ విక్రమ్‌సింహా

నందవరం : ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని సీఐ విక్రమ్ సింహా అన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలో గ్రామస్తులకు సైబర్‌నేరాలు, డ్రగ్స్, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరూ అల్లర్లకు పాల్పడొద్దని సూచించారు. అందరూ కలిసి మెలసి జీవించాలన్నారు. రాజకీయ కక్షలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎస్ఐ తిమ్మయ్య ఉన్నారు.

వీడుతున్న చిత్ర బంధం!

- ఫొటోగ్రాఫర్లపై సెల్ ఫోన్లు, డిజిటల్ కెమెరాల ప్రభావం
- శుభకార్యాల సమయంలోనే పనులు
- పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- ఆదాయం లేక వృత్తినే వదులుకునే దుస్థితి



ఎమ్మిగనూరులోని ఓ ఫొటోగ్రాఫర్ తన కెమెరాతో తీసిన ఓ కళాత్మక చిత్రం

ఎమ్మిగనూరు టౌన్: పసిపాపల బోసినవ్వులు, పుట్టిన రోజులు, వివాహ వేడుకలు, పెళ్లి రోజులు, విహారయాత్రలు.. ఇలాంటివి మరిచిపోలేని.. మళ్లీ మళ్లీ రాని మధురక్షణాలు. అలాంటి జ్ఞాపకాలను బంధించి మన కళ్ల ముందుంచేదే ఫొటోగ్రఫీ. అలాంటి వృత్తి నేడు అత్యాధునిక సంకేతికత, స్మార్ట్ ఫోన్లు.. డిజిటలైజేషన్.. ఆధునిక ల్యాబ్‌లు తదితర వాటి ప్రభావంతో అంతర్థానమయ్యే దుస్థితి నెలకొంది. ఫలితంగా ఫొటోగ్రాఫర్లు పనుల్లేక ఇక్కట్లు పడుతున్నారు. వారు ఇతర వృత్తులు ఎంచుకొనే పరిస్థితి నెలకొంది. కొందరు చేసే వృత్తిని వదులేక అరకొర ఆదాయంతో బతుకు బండిని లాగుతున్నారు. ఫలితంగా నియోజకవర్గ పరిధిలో ఫొటో స్టుడియోలు, ఫొటోగ్రాఫర్ల సంఖ్య తగ్గిపోతోంది.

పెరిగిన సాంకేతికత

గతంలో ఫొటో తీయించుకొని ప్రింట్ తీసుకోవాలంటే కనీసం ఒక రోజైనా పట్టేది. నేడు ఆ పరిస్థితి లేదు. సాంకేతికత పెరిగిపోయి అత్యాధునిక కంప్యూటర్లు, ప్రింటర్ల రాకతో సెకండ్ల వ్యవధిలో ఫొటో ప్రింట్లు వచ్చేస్తున్నాయి. దీనికి తోడు సెల్‌ఫోన్లు, డిజిటల్ కెమెరాలు రావడంతో ప్రజలు సొంతంగా ఫొటోలు తీసుకొని మెమోరికార్డులు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్ డిస్కుల్లో దాచుకునే పరిజ్ఞానం పెరిగిపోయింది. స్టుడియోలకు వెళ్లి ఫొటోలు తీయించుకునే వారి సంఖ్య తగ్గిందనే చెప్పవచ్చు. చిన్న చిన్న శుభకార్యాలు, కార్యక్రమాలు, సమావేశాల్లో సెల్‌ఫోన్లతోనే నిర్వాహకులు ఫొటోలు తీసుకుంటున్నారు. వాటిని కంప్యూటర్లలో భద్రపరుచుకొని చూడాలనుకున్నప్పుడు వాటిని చూసుకొని మురిసిపోతున్నారు. దీంతో ఒకప్పటిలాగా ఆల్బంలు చేయించుకునే వారు కరువయ్యారని ఫొటో గ్రాఫర్లు పేర్కొంటున్నారు.

పెరిగిన పెట్టుబడి

సాంకేతికత పెరగడంతో కంప్యూటర్లు, ఖరీదైన ప్రింటర్లు కొనుగోలు చేయాల్సివస్తుందని స్టూడియోగా నిర్వాహకులు చెబుతున్నారు. వీటి కోసం రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తుంది. అలాగే ఫొటోల ప్రింట్లు తీసే పేపర్లు, ఇతర వస్తువులపై జీఎస్టీ ప్రభావంతో ధరలు సైతం పెరిగిపోయాయి. వివాహాది శుభకార్యాలు, పెద్ద ఫంక్షన్లకు తీసే కెమెరాలు రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తుంది. తమకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేసి వృత్తిని బ్రతికించాలని ఫొటోగ్రాఫర్లు కోరుతున్నారు.

సగానికి పైగా తగ్గిన ఆదాయం

ఒకప్పుడు ఫొటోలు వేయించుకొని భద్రపరుచుకొనే సంస్కృతి వున్న సమయంలో ఫొటోగ్రాఫర్లకు మంచి రాబడి వచ్చేది. అయితే నేడు వివాహ శుభకార్యాలకు తప్ప ఫొటో ప్రింట్లు వేయించుకునే వారే లేరు. దీనికి తోడు సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకొని ప్రింట్లు వేయించుకుంటుండటంతో ఫొటో తీయించుకునేందుకు వచ్చే ఫీజులు రాకుండాపోయాయని స్టూడియోల నిర్వాహకులు అంటున్నారు. దీనికి తోడు ప్రభుత్వం ఆన్‌లైన్ వ్యవస్థ తీసుకురావడంతో ఆస్తుల రిజిస్ట్రేషన్, ఉద్యోగాలు, ఉన్నత విద్య తదితర వాటికి అవసరమైన పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకునే ప్రక్రియ కూడా నిలిచిపోయింది. బ్యాంక్‌ల్లో కూడా వెబ్‌కెమరాలు అందుబాటులోకి వస్తుండటంతో అక్కడా గండి పడింది. ప్రభుత్వ పథకాలు, కార్డులు, తదితర దరఖాస్తులకు అతికించే ఫొటోలు సైతం వెబ్‌క్యామ్ ద్వారా తీసుకునే పద్ధతి రావడంతో పాస్‌ఫొటోలకు క్రమేణ కాలం చెల్లిపోతోంది. దీంతో ఆదాయం లేక వేలకు వేలరూపాయల దుకాణాల నెలవారి అద్దెలు, విద్యుత్ బిల్లులు, స్టుడియోల్లో సహాయకులకు వేతనాలు ఇచ్చుకోలేక వృత్తి భారమైపోతుందని ఫొటోగ్రాఫర్లు వాపోతున్నారు.

ఫొటోగ్రఫీ భారంగా మారుతోంది



ఫొటోగ్రఫీ వృత్తి రాను రాను భారంగా మారుతోంది. ఫొటోగ్రఫీకి కావాల్సిన వాటి ధరలు పెరిగిపోయాయి. స్టుడియోలకు వచ్చి ఫొటోలు తీయించుకొనే వారు కరువయ్యారు. దీంతో ఆదాయం తగ్గిపోయింది. ఒక్క శుభకార్యాలకే ఫొటోలు తీసేందుకు పిలుస్తున్నారే తప్ప ఇతర వాటికి పిలిచే వారే కరువయ్యారు. కొత్త టెక్నాలజీలతో ఫొటోగ్రఫీ వృత్తి కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం ఈవృత్తిని కాపాడేందుకు చర్యలు తీసుకొని ఆదుకోవాలి. ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లకు శిక్షణ ఇచ్చి, బ్యాంక్ రుణాలు అందించాలి.
– రాఘవీరారెడ్డి, నియోజకవర్గ ఫొటోస్టూడియో యూనియన్ అధ్యక్షుడు, ఎమ్మిగనూరు

వృత్తిని కాపాడాలి



ఫొటోగ్రఫీ వృత్తిని కాపాడాలి. నూతన సాంకేతికత ధాటికి ఫొటోగ్రాఫర్లు తట్టుకోవడం కష్టమవుతోంది. రూ.లక్షలు వెచ్చింది అధునాతనమైన కెమెరాలు కొనే పరిస్థితి లేదు. ఫొటోగ్రాఫర్ల అభ్యున్నతికి ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి ఆదుకోవాలి. భవిష్యత్తులో ఫొటోగ్రఫీ వ్యవస్థ మనుగడ కోల్పోకుండా చూడాలి.
– కె.లోకేష్, సూర్యగ్రాఫిక్స్, గోనెగండ్ల

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



ఆరుబయటే సేద తీరుతున్న భక్తులు

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మూడో సోమవారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఉదయం నుంచే భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. మూడవ సోమవారం సుమారు 2 నుంచి 3లక్షల మంది భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకుంటరన్న అంచనా. అంతేకాక మూడవ సోమవారం సందర్భంగా మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆప్షన్ హాలిడే ఉంటుంది. భక్తులు ఉదయం నుంచే క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వీఐపీ దర్శన సౌకర్యం కల్పించడంతో దర్శనం సాఫీగా సాగుతున్నది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాత్రంత దర్శనాలు ఉంటాయని, రాత్రి 12 గంటల అనంతరం పూజల కోసం అరగంట పాటు దర్శనాలు నిలిపివేస్తామని ఆలయ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున స్వామికి సుప్రభాత సేవ, మహామంగళహారతి, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో పిండి వంటలు వండి నైవేద్యం సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కౌతాళం సీఐ అశోక్‌కుమార్‌తో పాటు మరో నలుగురు సీఐలు, ఎస్ఐలు, పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

వైభవంగా హోమ పూజ మహోత్సవం





ఉత్సవమూర్తుల ఊరేగింపు ,కలశాలతో ముందుకు వెళ్తున్న మహిళలు, చిన్నారులు

ఆదోని అర్బన్: స్థానిక బంగారు బజారులోని కాళికా కమటేశ్వర దేవస్థానంలో 39వ గాయత్రీ విశ్వకర్మ హోమ పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం గంగ ఆహ్వానం, గురువుల ఆహ్వానం, ధ్వజారోహణంతో మొదలై నవగ్రహ పూజ, గాయత్రీ విశ్వకర్మ, పంచామృతాభిషేకం, గాయత్రీ విశ్వకర్మ హోమంతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం పురవీధుల గుండా స్వామివారి విగ్రహాలను ఊరేగించారు. పీఠాధిపతులు కాళహస్తీంద్రస్వామి వరజ దివ్య ప్రవచనం వినిపించారు. కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు పార్థసారథి, యోగమండలి వీరేష్ ఆచారి, శిల్పి శీన, ధర్మకర్త అయ్యన్న ఆచారి, బీజేపీ రమేష్ ఆచారి, బీజేపీ నాయకులు శ్రీనివాస్ ఆచారి, స్వర్ణకార సంఘం ప్రెసిడెంట్ కదుర్బేల్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు సూచనలిస్తున్న అవోపా సభ్యులు

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ మరియు ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) వారి ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రి సహకారంతో ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య హాస్టల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించినట్లు అవోపా ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. శిబిరంలో దాదాపు 218 మంది రోగులు కంటి పరీక్షలు చేయించుకున్నారన్నారు. అవసరమైన ప్రతి ఒక్కరికీ కంటి శుక్లాల ఆపరేషన్ చేయడంతోపాటు నంద్యాలలోని ఆస్పత్రిలో రోగులు ఉండడానికి కావాల్సిన ఆహార, వసతి సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. అలాగే ఆదోని– నంద్యాలకు రానుపోనూ ఉచిత రవాణా సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదోని పట్టణ అవోపా అధ్యక్ష కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, నాయకంటి రఘు, కోశాధికారి యాదగిరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుడిసెపై కూలిన మహా వృక్షం



గాలివాన బీభత్సానికి గుడిసెపై పడిన పెద్ద వృక్షం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డు తిక్కస్వామి దర్గా వెనుకభాగంలో నివాసముంటున్న ఈరన్న గుడిసెపై ఆదివారం గాలివాన బీభత్సానికి ఒక పెద్ద వృక్షం కుప్పకూలింది. తెల్లవారు జామున మూడు గంటల సమయంలో భారీగా గాలి వీచింది. దీంతో అక్కడున్న పెద్ద వృక్షం ఊగిసలాడి ఒక్కసారిగా గుడిసెపై పెద్ద శబ్దంతో విరిగి పడింది. దీంతో నిద్రిస్తున్న ఈరన్న కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురై బయటికి పరుగు తీశారు. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్ చేసి గుడిసెకు ఉన్న విద్యుత్ సరఫరాను నిలిపి వేయించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. కుప్పకూలిన వృక్షాన్ని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పరిశీలించారు. అనంతరం గుడిసె యజమాని ఈరన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వీహెచ్‌పీఎస్ తాలూకా అధ్యక్షుడిగా తాయన్న



దివ్యాంగుల కమిటీ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు

కోసిగి: మంత్రాలయం నియోజకవర్గ వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) తాలూకా అధ్యక్షుడిగా ఎ.తాయన్నను ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బీసీ సోమన్న, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కోసిగిలో రేణుక ఎల్లమ్మ ఆలయ మైదానంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తాయన్న తాలూకా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గప్ప మాదిగ, ఎంఆర్‌పీఎస్ మండలాధ్యక్షుడు సామేల్, నాయకులు బసవరాజు, హనుమంతు, గోపాల్, రాజశేఖర్, ఈరన్న, నాగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక నమాజులో పాల్గొన్న ముస్లింలు

ఎమ్మిగనూరుటౌన్: వర్షాలు కురవాలని కోరుతూ ఆదివారం ఉదయం పట్టణంలోని ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక నమాజు చేశారు. కరుణామయుడైన అల్లా వర్షాన్ని కురిపించి సమస్త జీవులకు, పంటలకు ప్రాణం పోసి మానవుల కష్టాలు తీర్చాలని వేడుకొంటూ యూసూఫ్ మౌలానా దువా చేశారు. పలువురు మత పెద్దలు ఈ ప్రత్యేక నమాజులో పాల్గొన్నారు. కాగా సోమవారం ఉదయం సోగనూరు జెడ్పీ హైస్కూల్ సమీపంలో వర్షం కోసం ప్రత్యేక నమాజు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మత పెద్దలు తెలిపారు. ముస్లింలు వర్షంకోసం జరిగే ఈనమాజులో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే జైలుకే



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీరామ్

ఆదోని అర్బన్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే జైలుకు పంపుతామని ఆదోని వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అక్రమ మద్యం, నాటుసారా తయారీకి పాల్పడిన, నేరప్రవృత్తి కలిగిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేకంగా నాటుసారా తయారు చేసినా, అమ్మినా, కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యాన్ని తెచ్చి విక్రయించినా పీడీ యాక్టు కింద రెండు సంవత్సరాలు జైలుకు పంపుతామన్నారు. ఇప్పటికైనా నేర ప్రవృత్తిని మార్చుకుని మంచి ప్రవర్తనతో జీవనం సాగించాలన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: దేవరగట్టులో శ్రావణ మాసం రెండవ ఆదివారం సందర్భంగా మాళమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయంలోని మూల విరాట్‌కు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, భండరార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, ఆకుల అలంకరణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను పూజారులు పంపన్నస్వామి, మల్లయ్యస్వామి శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు.

శారదాదేవికి శ్రావణ పట్టి



పూజలందుకు శారదాదేవి అమ్మవారు



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఆదోని అర్బన్: పట్టణంలోని తిరుమలనగర్‌లో వెలిసిన శ్రీ శారదా శంకర మఠంలో శనివారం శారదాదేవికి శ్రావణ పట్టి కార్యక్రమాన్ని నిర్వహించా రు. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారికి పంచామృతాలు, విశేష ద్రవ్యములతో అభిషేకం, కుంకుమార్చన, ఆరాధనలు జరిపించారు. తిరుమలనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర సన్నిధానం నుంచి శంకరమఠం వరకు ఊరేగింపుగా దాదాపు 100 మంది ముత్తైదువులు ఒడిబియ్యం, చీరలు, గాజులు, పసుపు, కుంకుమలు తీసుకొచ్చి అమ్మవారికి సారే సమర్పించారు. శ్రీ శంకరమఠం విచారణ కర్త శ్రీ డాక్టర్ కృష్ణదేవరాయలు వారి నేతృత్వంలో దేవాలయ అర్చకులు గరుడాద్రి దత్తాత్రేయశర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాలనీ పెద్దలు రఘురామయ్య, హనుమంతరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



యోగీంద్ర మంటపంలో ప్రసంగిస్తున్న పీఠాధిపతి



భరతనాట్యం చేస్తున్న కళాకారిణి

మంత్రాలయం : రాఘవేంద్రుడి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని యోగీంద్ర మంటపంలో ఆదివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో శ్రీమఠం కళాకారులు రాఘవేంద్రుల జీవిత చరిత్ర నాటక ప్రదర్శన, బెంగళూరు రూపశ్రీ ప్రభంజన్ దాసవాణి, నెల్లూరుకు చెందిన దేవత సిస్టర్స్ భరతనాట్యం ఎంతగానో ఆకట్టుకున్నాయి.

చిన్న టెంకాయ.. పెద్ద మోసం!

- ఉరుకుంద క్షేత్రంలో టెంకాయల కాంట్రాక్టర్ మాయాజాలం
- పరిమాణం చిన్నగా ఉన్న టెంకాయల విక్రయం
- నిర్ణయించిన ధరకంటే అధికంగా అమ్మకాలు
- పట్టించుకోని ఆలయ అధికార యంత్రాంగం



పరిమాణం చిన్నగా ఉన్న టెంకాయలు



కేవలం 25 సెంటీమీటర్ల వ్యాసం కల్గిన టెంకాయ

మంత్రాలయం: అసలే వసూళ్ల జాతరతో ఈరన్న స్వామి భక్తులు తలలు పట్టుకుంటున్నారు. వసూళ్లకు మించిన దోపిడీ ఇక్కడ ఇంకోటి సాగుతోంది. టెంకాయల కాంట్రాక్టర్ కుయుక్తి నిజంగా నివ్వెరపోవాల్సిందే. ఎవరికీ అనుమానం రాకుండా సరికొత్త పంథాను ఎంచుకున్నారు. టెంకాయ వ్యాసం, అదనపు చార్జీతో అరకోటి పైగా దండుకునే పని పెట్టుకున్నారు. విషయం తెలిసినా అధికారులు మాత్రం భక్తులకు లోగుట్టు ఏమి తెలుస్తుందన్నా.. ధోరణిలో ఉండిపోయారు.

జిల్లాలో అత్యధిక ఆదాయం కల్గిన ఆలయం

జిల్లాలో అత్యధిక ఆదాయం కల్గిన ఏకైక ఆలయం ప్రముఖ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం. నంద్యాల జిల్లాగా ఏర్పడటంతో దేవదాయ శాఖకు ఇదొక్కటే పెద్ద ఆలయంగా మారింది. ఇక్కడ శ్రావణ మాసోత్సవాలు ప్రత్యేకం. ఉత్సవాల్లో దాదాపు 13 లక్షలకుపైగా భక్తులు పాల్గొంటారు. సోమ, గురు, శనివారాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటోంది. ఏటా రూ.13 కోట్లకుపైగా ఆలయం ఆదాయం వస్తుంది.

కాంట్రాక్టర్ కుయుక్తి

క్షేత్రంలో అందరూ ప్రత్యక్షంగా భక్తులను దోచుకోవ డం చూస్తాం. భక్తులకు బోధపడని మరో దోపిడీ ఇక్కడ చాపకింద నీరులా జరిగిపోతోంది. ఇదంతా టెంకాయల కాంట్రాక్టర్ మాయాజాలం. టెంకాయ సైజులో తన కుయుక్తిని ప్రయోగించారు. దేవదాయశాఖ, ఆలయ నిబంధన ప్రకారం ఇక్కడ టెంకాయ చుట్టు కొలత 30 సెంటీమీటర్లు ఉండాలి. వ్యాసం తక్కువ ఉన్న టెంకాయల విక్రయం ఇక్కడ నిషేధం. నిబంధనలు అతిక్రమిస్తే వేలాన్ని రద్దు చేసే అధికారం ఆలయ అధికారులకు ఉంది. టెండర్ కాపీలో షరతులు అన్నీ ముద్రించి వేలం నిర్వహించారు. అయితే కాంట్రాక్టర్ నిబంధనను తుంగలో తొక్కి టెంకాయ పరిమాణానికి ఎసరు పెట్టారు. అత్యధిక సంఖ్యలో 25 సెంటీమీటర్ల తక్కువ పరిమాణం ఉన్న టెంకాయలను దిగుమతి చేసుకున్నారు. ఉత్సవాల్లో ఎక్కువగా 25 సెంటీమీటర్ల పరిమాణం ఉన్న టెంకాయలే దర్శనమిస్తున్నాయి.

అక్రమ ఆదాయం అరకోటిపైనే

టెంకాయ కొలతను బట్టీ రేట్లు ఉంటాయి. 30 సెంటీమీటర్ల టెంకాయ ధర రవాణా ఖర్చుతో కలిపి రూ.15. అదే 25 సెం.మీ. టెంకాయ ధర రవాణతో దాదాపు రూ.13.50. ఒక్క లోడులో టెంకాయలు 60 వేలు వస్తాయి. 30 సెం.మీ. సైజు టెంకాయల లోడు రూ.9 లక్షలు పడుతోంది. అదే 25 సెం.మీ. వ్యాసం టెంకాయల లోడు రూ.8.10 లక్షలు. ఈ లెక్కన ఒక్క లోడులో రూ.90 వేలు మిగులు ఉంటుంది. శ్రావణ మాసోత్సవాల్లో దాదాపు 8 లారీల టెంకాయలు విక్రయిస్తారు. 4,80,000 టెంకాయలు అమ్ముడుతాయి. కేవలం కొలతల్లో వ్యత్యాసంతో లోడుకు రూ.90 వేలు చొప్పున రూ.7,20,000 లాజిక్‌తో దోచుకుంటున్నారు. అంతేగాక క్షేత్రంలో భక్తులకు రూ.20కి మాత్రమే టెంకాయను విక్రయించాలని నియమం. ఈయన మాత్రం టెంకాయల వ్యాపారులకు రూ.25 టెంకాయను ఇస్తున్నాడు. వ్యాపారులకు దానికి మరో రూ.5 కలుపుకుని రూ.30 చొప్పున భక్తులకు అంటగడుతున్నారు. టెంకాయ సైజు దోపిడీ కాదని అదనంగా ఒక్కో టెంకాయపై (30 సెం.మీ. సైజు టెంకాయ) రూ.10 ధర కడుతున్నారు. 4.80 లక్షల టెంకాయలపై ప్రత్యక్షంగా రూ. 48 లక్షలు అప్పనంగా సంపాదిస్తున్నారు. రూ.55.80 లక్షలు అక్రమ మార్గంలో దోపిడీ చేస్తున్నా అధికారులు మాత్రం టెంకాయల కాంట్రాక్టర్ జోలికి వెళ్లకపోవడం గమనార్హం. టెంకాయ ఏ సైజులో ఉందో కూడా పట్టించుకోకపోవడం దౌర్భాగ్యం.

రూ.25 చొప్పున ఇస్తున్నాడు

కొన్నేళ్లుగా ఇక్కడ టెంకాయలు అంగడి నడుపుకుంటున్నా. టెంకాయ కాంట్రాక్టర్ మొదట్లో రూ.20కే టెంకాయను ఇచ్చాడు. ప్రస్తుతం టెంకాయను రూ.25 చొప్పున ఇస్తున్నాడు. ఏమని అడిగితే గోదాము చార్జి అంటున్నాడు. మాకే రూ.25కి ఇస్తుండటంతో మేము భక్తులకు రూ.30 చొప్పున అమ్ముతున్నాం. ఇందులో మా తప్పేమి లేదు.
– మహంతేష్, టెంకాయల వ్యాపారి

మాకు తెలియదు

టెంకాయ కొలతలుగానీ, రూ.20కే టెంకాయను విక్రయించాలని మాకు తెలియదు. కాంట్రాక్టర్ టెంకాయపై ఎంత ఎక్కువ తీసుకుంటున్నాడో ఎరుగం. మాకు ఇచ్చిన దానికంటే రూ.5 ఎక్కువ పెట్టుకుని టెంకాయను అమ్ముతున్నాం. కాంట్రాక్టర్ తక్కువ చేస్తే మేము తగ్గిస్తాం.
– ఈరమ్మ, టెంకాయల వ్యాపారి

నోటీసులు జారీ చేస్తాం



టెంకాయ సైజు 30 సెంటీమీటర్లు ఉండాలని టెండర్ కాపీలో షరతు పెట్టాం. అదే సైజు ఉంటేనే ఇక్కడ విక్రయించాలి. అంతేగాక ఒక్కో టెంకాయను రూ.20 మాత్రమే అమ్మాలనేది నియమం. అంతకు మించి ఎక్కువ ధరకు విక్రయించకూడదు. ఇప్పటికే అందరికీ హెచ్చరించాం. అక్కడక్కడా టెంకాయ ధర ఫ్లెక్సీ పెట్టాం. కాంట్రాక్టర్ పరిమాణం లేని టెంకాయలు విక్రయిస్తే నోటీసులు జారీ చేస్తాం.
– పి.గురుప్రసాద్, డిప్యూటీ కమిషనర్